రెండు కోర్కెలు

(ఒక కథ)

కనుపర్తి వరలక్ష్మమ్మ గారు

౧

గుంటూరుజిల్లాలోఁ జేరొందిన న్యాయవాది యగు నరసింహారావు రొద్దిదైనా వ్యవహారము నిమిత్తము చేబ్రోలువెళ్లి పంతులు వేంకటప్పయ్యగారియింట బసచేసినాఁడు. నరసింహారావు వచ్చినపని రైనది. కక్షిదారు లెక్కడివా రక్కడ కేగినారు. మసఁగాల మెంగము లేర్పరుపరాకుండ కనుచీఁకటిపడినది. గుంటూరునం దున్నచోఁ బురమందిరమునో, యువజనసంఘసదనమునో మిత్రులతోఁ గలసి ముచ్చటలాడు సమయ మది నరసింహారావునకు. కాన నేమియుఁ దోఁచక చేతనున్న యాంగ్లవార్తాపత్రికను దీసి చదువ నుద్దేశించి దీపముదెస చూచినాఁడు. ఎట్టకేలోసిన్ఱా నూనెపోగను చిమ్నియంతయు నట్టముగా మసిగమ్మి యసహ్యము గొలుపుచున్న దాదీపము. నరసింహారావున కాదీపమునుండర చదువుకొనుటకు బుద్ధి పుట్టలేదు. అంత చదువుకొను ప్రయత్నమును విరమించి "యీపల్లెటూళ్లవచ్చిన నేమియుఁ దోఁచదని లోలోన గొణుగుకొనుచు, నొడిలోనుంచుకొనిన వార్తాపత్రికపై రెండుచేతుల నిడి పడుకకుర్చీపై దిరగిలబడి యటునిటు వ్యర్థముగాఁ జామము కూర్చున్నాఁడు. విశ్రాంతిగాఁ గూర్చుండుటచే నెదుటివస్తువు గోచరముగానంతటి యాలోచనాసమాధిలో నిలిచినది నరసింహారావు మానసము. ఈవిధముగా నొక్కగంట గడచినది. ఇంతలోఁ దనచరణముల నెవరోస్పృశించినట్లు తోఁచుటచే దప్పున చేరఁగిలబడియున్న నరసింహారావు నిలువునఁగూర్చుండి పాదములవంకఁజూచినాఁడు. ఎవరో స్త్రీ తనపాదములపై వ్రాలియున్నది. చరణస్పర్శకు నోర్చుచు నరసింహారావు "ఎవరమ్మా మీరు? పాదముల పీకుఁడు" అనెను.



"మీ ప్రథమభార్యను జానకిని"

"పాదముల నంటరాని పరురాలనుగాను"

పరురాలుగాక తనపాదము నంటుట కర్హురాలగు నాయింతి యెవరు? నరసింహారావున కేమియుఁ దోఁచలేదు. అనాలోచితముగా నప్రయత్నముగా "అయిన నీవెవ్వరు?" అనువాక్య మాతనినోటినుండి వెలువడినది.

"మీ ప్రథమభార్యను జానకిని" అని యిట్లు సచియింపుచుండగనే యామె కన్నీటిచే నరసింహారావు పాదములు కడిగినట్లయినవి. నరసింహా

రావు ఒడలు జల్లుమన్నది. హృదయము కంపించినది. సర్వావయవములు వివశములై పోయినవి. తానెద్దియో గొప్ప యకార్యముచేసిన దోషినని నరసింహారావునకు భావన గలిగినది. జానకి కెనిమిదేండ్లు, తనకు పదిరెండేండ్లు. అంత చిన్నవయసులో నిరువురకు వివాహమైనది. ఆ వివాహ వృత్తాంతమే నరసింహారావునకు జ్ఞప్తిలేదు. నరసింహారావు మెట్రిక్యులేషన్ పరీక్షలో గెలుపొంది చెన్నపురిలో యఫ్.ఏ.తరగతిలోఁ జదువుచుండగా "నీభార్యకు కన్నులు జబ్బుచేసినవి. నీ మామ నిర్భాగ్యుడు. డబ్బు కర్చగునని రొట్టెవైద్యము చేయింపలేదు. పోనిమ్ము మేము నయముచేయించుకొందు మనిన మన యింటికిఁగూడ బంపలేదు. ఆ కన్నులలో నిప్పుడు పువ్వులు పుట్టినవి. ఎదుటి వస్తువు కనుపడుటలే దిప్పుడాపిల్లకు; ఇంక గొన్నాళ్లకాపిల్లకు వెలుగుగూడ కనుపడని స్థితివచ్చునని యందఱు చెప్పుచున్నారు. ఇక వైద్యము చేసినను లాభము లేదనికూడ చెప్పుచున్నారు. ఆ రోగమట్టిది. ఈ గ్రుడ్డి పెండ్లము నీ కెందులకు? ఆపిల్ల యిక పుట్టినింట తల్లిదండ్రుల ప్రాపున బ్రతికియుండవలసినదే. కాన నీ కొక మంచి సంబంధము కుదిర్చితిని. పిల్ల చక్కని చుక్క; మామ ధనికుడు. దశమి నాడు వివాహముహూర్తము" వెంట నేరమ్మని తండ్రి వద్దనుండి జాబు వచ్చినది. మతిహీనతయో, చిన్నతనమో, పితృభయమో, ఏమైననేమి నరసింహారావు నిజానిజములు పరికింపలేదు. యుక్తాయుక్తతలు యోచింపలేదు. ధర్మాధర్మములు విమర్శింపలేదు. తండ్రి చెప్పినవేళకు వచ్చినాడు; మరల నాలుగు పంచులు యింట కుమ్మరించినాడు; అయిదు దినములు పల్లకిలో నెక్కి యూరేగినాడు. ఎప్పటివలె చదువునకు వెళ్లిపోయినాడు.

క్రమముగా నరసింహారావు బి. ఏ., బి. యల్. పరీక్ష నిచ్చినాఁడు; ప్లీడరైనాఁడు; చిన్నభార్య కాపురమునకు వచ్చినది; తండ్రి రాలిపోయినాఁడు; తానే స్వతంత్రుఁడైనాఁడు. ప్రజ్ఞగల ప్లీడరని పేరుపొంది వేలకు వేలు ధనము గడించినాఁడు. మేడలు కట్టినాఁడు; భూములు కొనినాఁడు; బ్యాంకులు నింపినాఁడు; నగలు చేయించినాఁడు; మోటారుబండి కొనినాఁడు; ముగ్గురు బిడ్డలకుఁ దండ్రియై భార్యాబిడ్డలతో సుఖముగ నఖండ విభవ మనుభవించుచున్నాఁడు. ఈమహదైశ్వర్య వైభవ పరంపరలో నరసింహారావునకు జానకి స్మృతియే లేదు. ఇట్లు బహుకాలముక్రింద విస్మరింపఁబడిన భార్య యెదుటకు వచ్చి నేను నీభార్యనని పలుకుచున్నప్పుడు నరసింహారావు హృదయము చలింపదా! బహుదూరమాలోచించిన వెనుక భార్యకు కన్నులుపోవుటచేఁదాను బునర్వివాహము చేసికొనవలసి వచ్చినట్లు నరసింహారావునకు జ్ఞాపకమువచ్చినది. అప్పుడు నరసింహారావు "నీ కండ్లజబ్బు నయమేనా" యని ప్రశ్నించెను.

"నా కండ్లకేమి?

'నీ కండ్లలో పువ్వులుపూచి దృష్టిభంగమైనదట గాదా? మీ నాయనగారు వైద్యముచేయింపక పోవుటయేకాక మా నాయనగారు "మా యింటికి పంపుడు. మేము బాగుచేయించుకొందు"మనినపంపలేదుటగాదా?"

"నా కన్నుల కెప్పుడట్టి దురవస్థ పట్టలేదు"

"అయిన మా తండ్రిమాట యబద్ధమా?"

"అబద్ధమే."

"నీ కేవ్యాధియు లేక సుఖముగా నున్నచో మా తలిదండ్రులు నాకు మరల వివాహమేల చేయుదురు?"

"పునస్సంధానకట్నము వేయున్నూటపదాఱులు మా తండ్రి యీయజాలననుటచే."

నరసింహారావు సంభ్రమాశ్చర్యములకు లోనై నిశ్చేష్టుఁడైనాఁడు. కట్నముల దురాగత మెఱుఁగును! తండ్రి లుబ్ధత్వ మెఱుఁగును. నిజముగ కట్నమునకై వారిని పీడింప, వారు కాదన, తండ్రి యీ మాయాజాలమునుబన్ని తనకు మరలవివాహము చేసియుండవచ్చును. ఇందబద్ధమేమున్నది? సంశయ మేమున్నది? ఇట్లు తలఁపగనే సిగ్గుచేతను విచారముచేతను నరసింహారా[వు] క్రుంగిపోయెను. 'ఎంత విచారపడిన నేమి, గత జలసేతు బంధనము'అని నరసింహారావునకుఁ దోఁచినది. ఆ పాప పరిహారార్థముగా భార్యనిప్పుడు సాంత్వనవచనముల నుపలాలించుటకుఁ దన చిత్తమునకు స్వాస్థ్యము లేదని నరసింహారావు భావించెను. కాన "జానకీ; నేను నీకు

మహోపకారము గావించితిని. నీవు పతి పరిత్యాగినివై యల్లాడుచుండ నేను మహా భోగములతోఁ దులఁదూగు చుంటిని. ఏ సుఖసమయమునందైన నిన్నుఁ దలపెట్ట నైతిని. నీవు జీవితవై యుంటివో లేదో గమనింప నైతిని. తలిదండ్రులయందు విధేయుఁడను, విశ్వాసము గలవాఁడను నై వారు చెప్పిన చొప్పున వర్తించితిని. అవిమర్శత నాదోషమే యగును. కాని యా ద్వితీయ వివాహకాలమునకైన నేను విశేషము పెద్దవాఁడను కాను. ఇది బాల్యవివాహ పాపఫలము. అయినను నీయెడ నేచేసినపాప మనంతమని యొప్పుకొనెదను. కాని యిది యంతయు నేను బుద్ధిపూర్వకముగాఁ జేసినదిమాత్రము కాదని విశ్వసింపగోరెదను. నీకును నాకును నవ్యక్తావస్థ యందే వివాహ మైనది. మరల నన్ను నీవెఱుఁగవు. నిన్ను నే నెఱుఁగను. కాల మిట్లు గడచినది. అయిన దేమో యైనది. కడచినదానికి వగచిన లాభము లేదు. నీజీవనాధారవిషయమై నేను విస్మరించి యూరకొనుట మహాపరాధము. కాన నీకు నాలుగువందల రూప్యములు వచ్చు పల్లపుభూమిని నీ యిచ్ఛానుసార ముగ ననుభవించుమనట్లు వ్రాసియిచ్చెదను. చాలునా?"

"నాభుక్తికిజాలిన యాస్తిని నాజనకుడే నా కొసగిపోయెను. లేదా? ఏకైకపుత్త్రికనగు నాయవస్థకు దురపిల్లి దురపిల్లి నాతలిదండ్రులు మరణించిరి. నన్ను బోషింపవలసిన మీరు వదలిపెట్టితిరి. కాన మాతాపితృ హీనను, పతిపరిత్యక్తను, సంతానహీనను, తిన దిండి లేక మరణించినను నాకొఱకు దుఃఖించువా రెవ్వరు? నాకెందులకు ధనము? సభర్తృకకు భరణమా? విశ్వము జేయున్యాయముల దిద్దను న్యాయవాదులగు తమ రిట్లు వచించుట న్యాయమా?"

జానకినోటినుండి వెలువడినవి మాటలో నిశితశర ములో నరసింహారావు యోర్పు లుపఁజాలక పోయెను. ఆ శరములచేతుల కాతని హృదయనాళములే తెగినట్లయ్యె ను. పరవ్యవహారములలో నతిచాకచక్యముతోఁ బ్రసం గించెడు నరసింహారావు నోటినుండి మాటలే వెలువడ కుండెను. చాలసేపున కతిప్రయత్నములో, గంపితస్వర ముతో, "అయిన నీకేమికావలె" నని యడిగెను.

"మీచరణసేవ."

నరసింహారావు మరల నొకపరి స్తబ్ధుఁడయ్యెను. మాటాడలేదు. యేమిమాట్లాడును? రెండవభార్య కాఁపు రమునకువచ్చి ముగ్గురుబిడ్డలతల్లియై గృహయజమాను రాలై యింటనున్నది. తనతల్లికిని భార్యకును బొసఁగక నిత్యజగడము లాడుచున్నారు. అట్టిచో నీభార్యను గూడఁ దీసికొనిపోయి యెక్కడయుంచును? తీసికొని వెళ్లినచో నామె యూరకొనునా? ఆమె యేమైనఁగాని మాటలాడినచో నీమెపడునా? అన్ని బాధలలో నుభయ పత్నీ బాధవంటి బాధ లేదని పెద్దలందురుగదా! అట్టిచో నిట్టిబెడఁద చేఁజేత నెట్లు తెచ్చిపెట్టుకొనును? లేదా? "మీచరణ సేవ" యని దీనాననయై యాచింపుచున్న యిల్లాలిని నిష్కారణముగాఁ ద్రోసిపుచ్చు టెట్లు? ఈ తర్కవితర్కములతో నరసింహారావు మానసము సం క్షుభిత మయ్యెను. కోమలహృదయుఁడగు నాతనికి భార్యను దీసికొనిపోవు ధైర్యముగాని, నిరాకరించు కాఠిన్యముగాని లేదయ్యె. కాన నాతఁడు కలఁగఁ బాఱిన చిత్తముతో జాలిగొలుప నిట్లు పలికెను.

"జానకీ! నేను మరలఁ బెండ్లాడిన సంగతి నీకుఁ దెలియునుగదా!"

"తెలియును."

"ఆవిడ పదేండ్లనుండి కాఁపురము సేయుచు గృహయజమానురాలును, బిడ్డలతల్లియు నై యున్నది. న్యాయము వచింపఁదలఁచినచో మఱి నీవుగూడ యట్టి దానవే! కాని యొకయొఱలో రెండుకత్తు లిముడునా? నిన్ను కాదనుట గాదు. నా మనోగతాభిప్రాయము తెలుపుచుంటిని. నీవేచెప్పుము!"

"ఒఱలో బూర్వమేకత్తియున్నదో, ఆకత్తియే సర్వదా ఉండవచ్చును. కాని స్వామీ! బుద్ధితెలిసిన నాటనుండి పతివిముక్తనుగానే యుండుటచే నన్ను జూచినవారెల్ల "అదిగో! మొగుడు వదలిపెట్టిన పిల్ల" యని వ్రేలజూపువారు. ఆవాక్యము నాకెంతయో యవమానకరముగ నుండెడిది. ఆయవమానవాక్యమునకు వెఱచి యిరుగిళ్లెఱుఁగ; పొరుగిళ్లెఱుఁగ; బంధుగృహ మెఱుఁగ; పెండ్లిపేరంటము లెఱుఁగ; వేడుక లెఱుఁగ; వినోదము లెఱుఁగ; చక్కనిచీరరవిక లెఱుఁగ; అంద మగు నాభరణము లెఱుఁగ; వేయేల? దొడ్డియందు విర

బూసిన పువ్వులనైన దలను దురుము బెఱుఁగ; అగ్రాహ్యస్థితిలో మీరుకట్టిన కంఠసూత్రమునకు బద్ధురాలనై గ్రాహ్యత వచ్చినది మొదలు మగడు వదలిపెట్టిన పిల్ల' అని లోకులను నవమానవాక్యమునకు వెఱచి సర్వసుఖములపరిత్యజించి,సన్యాసినినై, జీవచ్ఛవమునై బ్రతుకుచున్నాను. నాథా! మీయింట వంటకత్తెగానైన బరిగ్రహించి వాకిలియూడ్చు దాసిగానైన జేపట్టి నా యపయశమును బాపరా? నన్ను తోడిమానినులతో పాటు తలయెత్తుకొని తిరుగునట్లు చేయరా?"

తన పాదములపై వేగముగాఁ బడుచున్న కవోష్ణ బాష్పధారలచే జానకి తీవ్రముగా నేడ్చుచున్నట్లు నరసింహారావు గ్రహించెను. జానకి శోకాగ్ని నరసింహుని హృదయమును వెన్నవలెఁ గరఁగించెను. ఇఁక నవ్వునగా దమట కాతనికి నోరాడలేదు. అంత నాతఁడు కనుల నీరు గారుచుండ గద్గదకంఠుఁడై "జానకీ, శోక ముడుగుము. రేపు నిన్ను నా యింటికిఁ దీసికొని వెళ్లెద" నని పలుకుచుఁ జిరభర్తృవియోగవ్యథచేఁ గృశించి చర్మాచ్ఛాదితాస్థిపంజరమువలె నున్న జానకిని తన పాదములపైనుండి రెండుచేతు లఁబట్టి లేవఁదీసెను.

"యేవూరమ్మా మీది"

౨

జానకీ సహితుఁడై మోటారుబండిపై నెక్కి నరసింహారావు ఉదయ మెనిమిదిగంట లగునప్పటికి గుంటూరుహోని స్వగృహమున కేతెంచెను. మార్గమధ్యమున జానకికిని,తనకును జరిగిన పరస్పర సంభాషణలోఁ దాను బసచేసిన గృహము జానకి మేనమామగారిదని నరసింహారావు తెలిసికొని యక్కజపడెను. 'దైవ ఘటన చిత్రముగదా!' అనుకొనెను.

నరసింహారావు బండి దిగగనే తననౌకరుతో నీమెను లోనికిఁ దీసికొని పొమ్మనిచెప్పి తాను కచ్చేరి సావడిలోనికి వెళ్లెను. నౌకరు త్రోవచూప జానకి లోపలికి వెళ్లెను. నరసింహారావు చిన్నభార్యయగు సుందరి యప్పుడు కాఫీ త్రాగుచున్నది. నరసింహారావు తల్లి నాఁడేకాదశి యగుటవలనఁ గోడలిపైఁ గోపముచేఁ బనివారలచేఁ బిండి విసరింపక తానే స్వయముగ విసరుచున్నది. జానకిని సుందరి యెఱుఁగనే యెఱుఁగదు గదా! అత్తగారికైన గుర్తుపట్టలేదు. కాన లేఁతపాఁటఁ జూచుటయేకాని జానకి నొకరును బలుకరింపలేదు. సుందరి సహజముగా గర్వితమతి; చేయిత్రిప్పకుండ, కాలు కదపకుండ, మెడ తిరుగకుండ నగలున్నవారి నే కాని సాధారణులైనవారి నాపిడ పలుకరించుటకాని పలుకుటకానియుండదు. కాన జానకికి సుందరి సత్కార భాగ్యము గలుగలేదు. పెనిమిటితో వ్యాజ్యవ్యవహారములకో, లేక తనయింట పనిపాటులు చేయుటకో వచ్చిన స్త్రీనిగా సుందరి భావించెను. కాన చూచియుఁ జూడనట్లూరకొనెను.

జానకి గోడవానుకొని నిలుచఁబడియే యుండెను. ఎవరు కూర్చుండుమన లేదు. కొంతతడ విట్లుగడచిన వెనుక నరసింహారావుతల్లి జానకివంకఁజూచి "యేవూరమ్మా మీది" యనెను. మాటమందలింపులు లేక తా నిలిచి యున్నస్థితి జానకికి మిక్కిలి దుస్సహముగను, దుఃఖ ముగను నుండెను. అత్తగా రట్లు ప్రశ్నింపగనె జానకికి మఱింతదుఃఖము వచ్చెను. అంత నామె పైఁటచెఱఁగునఁ గన్నీరద్దుకొనుచు "బ్రాహ్మణకోడూరు" అనెను. పిచ్చమ్మగారికిఁ బూర్వస్మృతి గలిగినది. జానకి దెస లేఁతపాఁటఁజూచి "అమ్మాయీ! అట్లు నిలువబడితి

వేమి? కూర్చుండు" మనెను. జానకి నెమ్మదిగాఁ గూర్చుండెను. అంత "మీయమ్మయు నాయనయు బాగుగా నున్నారా" యని పిచ్చమ్మ ప్రశ్నించెను. "వారిద్దఱు పోయిరి. నేనుమాత్రమె చావక నిలిచియుంటి" నని జానకి మఱియొకమారు కన్నుల నీరునించెను. "ఏడువకమ్మా! పెద్దలుగనుక వారు దాటిపోయినారు. మూడేండ్ల దానవు. నీకేల యంతమాట యనుకొనవలెను? ఏకాలమున కేమియదృష్టము గలుగనున్నదో! అందఱు నీవంటి వారు కారా? నీవందఱివంటిదానవు కావా?" అని పిచ్చమ్మగారు సుందరిపైఁగల యాసను జానకిపై ననుగ్రహముగా మఱల్చి యూఱడించినది.

నరసింహారావు పెద్దభార్యను దీసికొనివచ్చిన సంగతి యింటిలోని పనిపాటులవారికేఁ గాదుగదా, యిరుగుపొరుగువారికిఁగూడ క్షణములోఁ దెలిసిపోయినది. ఒక్కొక్కరేదియో పనికల్పించుకొనివచ్చి జానకిని జూచి 'చెంపకు చేరెడుకన్ను లున్నవే! గ్రుడ్డిదని చెప్పుకొన్నా రేమికారణమో!' యనియు, 'సుందరికన్న నీమెయే చక్కగా' నున్నదనియు, లోలోన గుసగుసలాడ నారంభించిరి. 'ఆగ్రుడ్డితన మెట్టిదియో' యని కొందఱు మరలమరల వచ్చిచూచి సందేహనివృత్తి చేసికొనుచుండిరి. వచ్చిపోవువారి గుసగుసలు,అత్తగారి కుశలప్రశ్నలు, సుందరి మది కొకింత యాందోళన గలిగించెను. పెనిమిటివచ్చిన నాతని నడిగి సందేహనివృత్తి చేసికొనవలయు నని యెదురు చూచుచుండెను. సిగ్గుననో, భయముననో,నరసింహారావు నాఁడు యెంతసేపటికి లోనికి రాలేదు. పదిన్నరగంటలయిన వెనుక నరసింహారావు అడావిడిగా లోనికివచ్చి స్నానముచేసి భోజనమునకు వెళ్లెను. భోజనముసేయుచు నరసింహారావు తల్లితో జానకిని పిలిచి భోజనము పెట్టవలసినదని చెప్పెను. నరసింహారావు భోజనముచేసి గదిలోనికి వెళ్లు సరికి నాకులు పోకలు చేతఁబట్టుకొని సుందరిగూడ యటకువచ్చెను.

ఉదయమునుండి సుందరి మానసము తుపాను రేగిన సముద్రమువలె సంక్షుభితమగుచుండెను. వచ్చిన యా విడ తన సవతియై యుండునని సుందరి కనుమానము గలిగినది. కాని రూఢికాలేదు. ఎవరినడుగను? ఎవరి నడిగిన సవతియని చెప్పుదురో? అని సుందరి భయము; సవతియను పేరు తలఁచుటకే, వినుటకే, చెప్పుటకే యామెకు దుస్సహముగ నున్నది! అట్టిచో నితరుల నడుగునా? అయ్యో! సిగ్గు! సిగ్గు! అందువలన భర్తనే యడిగి యనుమానము తీర్చికొనవలెనని సుందరి తలఁపు; కాని నరసింహారావు ఉదయమునుండి కంటికే యగుపడఁడయ్యె. ఏమి చేయును? ఎట్లో మనస్సు బిగబట్టుకొని యూరకొనినది. సుందరి హృదయాందోళనము మొగమున స్పష్టముగఁ గాన్పించుచున్నది. నరసింహారావు భార్యస్థితిని బరికించినాఁడు. తనపై వాఁడి బాణములు ప్రయోగింపఁబడ నున్నవని యనుకొన్నాఁడు. మాట్లాడకుండ నూరకున్నాఁడు. నరసింహారా వేమైన ప్రసంగించునేమో! ఆ సందర్భమున నడుగవచ్చునని సుందరి యనుకొనెను. కాని నరసింహారావా ప్రస్తావనయే యెత్తఁడయ్యె. పైపెట్టుకోటు తలపాగ వగైరా ధరించి కచ్చేరికిఁబోవ సిద్ధమగుచుండె. సుందరి యిఁక భరింపలేక పోయెను. గ్రుడ్ల నీరు గుప్పల నప్పళించుచు "ఆ వచ్చినయామె యెవ"రని భర్తను బ్రశ్నించెను. "నా ప్రథమభార్య" యనెను నరసింహా

"ఆ వచ్చినయామె యెవ"

రావు. సుందరి కామాట శలపిడుగైనది. హృదయము కంపించినది. కన్నుల నీళ్లు గ్రమ్మినవి. మొగము తెల్లనైనది. ఒడలునఁ జిఱుచెమటలు గ్రమ్మినవి. అవయవ

ములు పటుత్వముదప్పినవి. నిలువఁబడుటకే యసమర్థురాలై నేలఁగూలఁబడినది. సుందరి దైన్యావస్థ నరసింహారావు గమనించెను. "సతులకు సవతులన్న నెంతభీతి" యనుకొనెను; నెమ్మదిగా నామె నూరడించువాఁడై "సుందరీ! ఏల నీకింత విచారము? సవతి యనినంత మాత్రముననే యావిడకై నీవింత భయపడవలసి యవసరము లేదు" అనెను. నరసింహుని యుపలాలనవాక్యములచే సుందరి కొంకింత జడుపు దీరినది. కోపము హెచ్చినది. కాన భర్తదెస తీవ్రముగఁ జూచుచు, "ఏమి! నేను జడియవలసినపని లేదా? పదునైనకత్తినిగంతముపైనిడి భయములేదందురేమి? అవును, మీకేమి భయము? పదిమంది భార్యలనైన బోషింప సమర్థులు. ఇంట తలలుగూడక చచ్చునది యాడువారు గాని మగవారి కేమి?"

"ఎందుల కీయుపన్యాసము?"

"నాశోకాలాపములు మీ కుపన్యాసములుగా నున్నవా?"

"కాక యిదేమిగోల?"

"అనిన మీకు గోపమువచ్చునుగాని మీరు చేసినపని బాగుగ నున్నదా? కాదనిన నాలుగువందలు పారవేయవలెను. అంతకంటె నెక్కువ భోగముతో దూగుటుయ్యెలలో నూగింపదలచినచో వేఱొక దివ్యభవనము గట్టించి యందుంచవలెను. అంతియేకాని వ్యవహారమునకని వెళ్ళి యేనాఁడో విడనాడినభార్యను మోటారుబండిపై నెక్కించి నాలుగూళ్లూరేగింపున దీసికొని వచ్చి గృహప్రవేశము చేయింతురా? మీయమ్మగారి పోరులోనే నలిగి చచ్చుచుండ బైని సవతిపోరుకూడ దెచ్చిపెట్టితిరా?"

"సుందరీ! వృథాకంఠశోషపడకు. ఆమెకూడ నీవలెనే యగ్నిసాక్షిగా బెండ్లాడిన ధర్మపత్నిగాని పరస్త్రీగాదు. ఈనాసంపత్తియందు నీకెట్టి యధికారము గలదో, ఆమెకుగూడ నట్టియధికారమే కలదు. అధికారముమాట యటుంచుము. ఆమెకు దలిదండ్రులు మరణించిరి. తోడబుట్టినవారు లేరు. నాయనువారు లేక యనాథయై యల్లాడుచున్నది. కాన కనికరము గలిగి తీసికొనివచ్చితిని. పోనిమ్ము; నీకును నామెకును బొసగనివాఁడు నీవు చెప్పినట్లు ప్రత్యేకగృహముననే యుంచెదను."

"నాఁడు చెప్పిన దొకటి. నేఁడు చేసిన దొకటి. మిమ్ము కాదనువా రెవ్వరు?"

"ఏమి చెప్పితిని?"

"మీరుగాదు. మీతండ్రిగారు, మా కొమారునకు రెండవవివాహమని చెప్పిరి. కాని ప్రథమభార్య జీవించి యున్నదని తెలుపరైరి. రెండవవివాహ మనగ మా తండ్రిగారు భార్య మరణించియుండునని భావించిరి. ఎక్కడనో మాఱుమూలను కోనసీమనువసించు మాతండ్రికింకలిమర్మము తెలియదయ్యె. తెలిసియున్నచో నిక్షేపమువంటి కోనసీమ కొబ్బరితోట నమ్మి నాలుగువేలు కుమ్మరించి యిట్టిసవతిపోరు సంబంధమును చేసియుండునా? ఈగుట్టు తెలిసినతరువాత మాతండ్రి యెంత దుఃఖించెనో చూచినదానను నాకు దెలియును?"

"మాతండ్రిగారు యింతటిమోసము చేసియుండునా? నేను నమ్మను."

"మీతండ్రిగారు వ్రాసిన యుత్తరములు మా నాయనగారివద్ద నిప్పటికిని యున్నవి. కావలయునన్న జూడవచ్చును."

నరసింహారావు నిరుత్తరుఁ డయ్యెను. ధనాశ తనతండ్రిచే నెట్టిదురాగతముల చేయించెనో, తానేవిధముగాఁ దలిదండ్రులచేతి సంతపశువుగా మాఱెనో, తలఁపఁగనే నరసింహారావు సిగ్గుచేతను, విచారముచేతను నధికముగాఁ గ్రుంగిపోయెను. కళాహీనమైన నరసింహుని వదనారవింద మాతని మానసికవ్యవస్థను విశదీకరింపుచుండెను. భర్తమ్లానవదనము సుందరి కొంకింత జాలి కలిగించెను. అతఁ డీవిషయమున నిర్దోషి యని యామెకుఁ దెలియును. కాని సవతిని నెత్తిపైఁ దెచ్చిపెట్టెనను నాగ్రహ మామె కాతనిపైఁ గలిగిన జాలినిఁ బైకి నెల్లడింపనీయకుండెను. కాన నామె కోప మతిశయించుటచేఁ గలిగిన దుఃఖముతోఁ గంటతడి యద్దుకొనుచు "పరిణయపు సంగతులనుగూర్చిన చింత యిప్పుడేల? కాని మంచిచెడ్డ లాలోచింపకుండ మీరిప్పు డామెను దీసికొనివచ్చితిరి. ఇప్పుడు మీయమ్మయే నన్ను కత్తి

కోత కోయుచున్నది. ఇక నీమెయు నామెయు కగూడిన నాదురవస్థ యెట్లుండునో యోచింపుడు. ప్రక్కల దావాగ్నుల దరికొల్పిన నే యిల్లాలైన ల్లు భరింపగలదు? ఏమైనసరియే; యిప్పుడామె నామె యింటికి బంపినగాని వలనుపడదు" అని సుందరి పెద్దగా దుఃఖించెను. నరసింహారావు కొంచెము విసుగుతో భార్యవంకఁజూచి, "ఇక్, ఏడువకు. ఆవిడ నిన్నేమియు బాధపెట్టదు. నీయధికారమున కడ్డురాదు. నీభోగ భాగ్యముల కడ్డురాదు. అట్లు వాగ్దత్తము చేయించుకొనియే తీసికొనివచ్చితిని. నీయింట నొకపనికత్తెగా నుండును. దాన నీకేమినష్టము?" అనెను.

"ఇట్టి మాయమాటలను నమాయకులగు మీరు నమ్మవలెనుగాని నేను నమ్మను. డబ్బునకు జేరిన పని మనుష్యులే నూతిదవలె వచ్చి, నాల్గుదినములు గడచిన దబ్బనమువలె దేలుదురు. అట్టివారో భార్యయైన నూరు కొనువా?"

నరసింహారావున కొకింత యాగ్రహము వచ్చినది. "ఊరకొనక పోయినఁ బోనిమ్ము. ఆమె దబ్బనముగాఁ దేలిన సరియే, గడ్డపలుగుగాఁ దేలిన సరియే. రమ్మనిన నోట మరలఁ బొమ్మనను. నీకిష్టమైన నామెతోఁగలిసి యుండుము. కష్టముగా నున్న వేఱయుండుము. అంతకును దుస్సహముగా నున్నచో మీతండ్రి యింటికి వెళ్లుము" అనెను.

నరసింహారావు కఠినవచనములకు సుందరికి మఱింత దుఃఖము వచ్చినది. అంత నామె భోరుభోరున విలపింపుచు: "ఇంక నెందరున్నా రీవిధముగా మీచే గంపసూత్రములు బిగింపబడి వదలివేయబడినవారు" అనెను. నరసింహారావు కొంచెముగా నవ్వుచు "నాకు జ్ఞాపకమున్నంతవఱకు మీ రిద్దరే! ఈమాత్రపు జ్ఞాపకముగూడ నుంచుకొనజాలని శైశవావస్థలో నింక నెవ్వరికైనఁ దాళి గట్టించిరేమో మాయమ్మనడుగవలె"ననెను. ఆ యేడ్పులో నవ్వువచ్చినది సుందరికి!

3

జానకి పెద్దలతో భాషించుటకంటె పిల్లలతో ముచ్చటలాడుట కెక్కువ కుతూహలపడును. వారుచెప్పినదెల్లఁ జేయుట కామెకు విసుఁగులేదు. వారికి జడలు వేయుట, నీళ్లు పోయుట, దుస్తులు వేయుట, అన్నము పెట్టుట, బొమ్మలు చేసిపెట్టుట, ఆటలు నేర్పుట, కథలు చెప్పుట, జోలలు పాడుట, నిద్రలు పుచ్చుట, మున్నగు పనులసేయుటయం దామెకు మిక్కిలి కుతూహలమును, నోపికయును, వహించియుండును. ఇట్టి శిశుమిత్రురాలగు జానకికిని, సుందరి బిడ్డలకును నచిరకాలములోనె సఖ్యము కుదిరినది. 'అమ్మ,అమ్మ,' యని వారామెను వెంటాడి తిరుగుచుఁ దమకుఁ గావలసిన కర్జములనెల్ల నామెచేఁ దీర్చుకొనుచుండిరి. సుందరి మొదటఁ దన పిల్లలామెతోఁ గలియకుండుటకుఁ బ్రయత్నించెను. కాని జానకి మిక్కిలి వాత్సల్యముతో వారినిఁ జేరదీయుటయు, తాను పిల్లాడ నిండు ప్రొద్దులై యుండుటయు, పిల్లల పనులెల్ల జానకి చేయుటచేఁ దన భారము తీరినట్లుండుటయుఁ దలఁచి తన యసూయను తన మనస్సుననే యడంచుకొనవలసిన దయ్యెను. విశేషించి జానకి సాధుప్రవర్తనమును, మితభాషిత్వమును సుందరి యీసును ద్విగుణముగా నడఁచివేయుచుండెను.

'ఒడిలో నిప్పు డేకత్తియున్నదో, ఆ కత్తియే శాశ్వతముగానుండుఁగాక' యని తాఁబలికిన వాక్యమును జానకి సత్యభంగము కాకుండ రక్షింపుచుండెను. గృహకార్యములపట్ల యింటిదానివలెను, ధనాధికారముల దెస పెరదానివలెను వర్తింపుచున్న జానకి ప్రవర్తనము సుందరి కక్కజము గలిగించుచుండెను. అటు అత్తగారిపట్లను, నిటు సవతిపట్లనుగూడ నామె సమభావముతో మెలఁగుచుండెను. గృహకల్లోలము లేమియుఁ గలుగమికి సంతసింపుచు నరసింహారావుకూడ జానకిపట్ల సంతుష్టుఁ డయ్యెను. పనిపాటులవారేమి, ఇరుగుఁబొరుగువారేమి, ఇంటిలోనివారేమి, జానకి సౌమ్యప్రవర్తనము జూచి జానకి యపరజానకియేయని భావింపుచుండిరి.

జానకి భర్తృగృహమున కేతెంచిన యాఱుమాసములకు జానకికిఁ దండ్రియొసఁగిన భూమిని జేసెడు రైతులు మూఁడువందల రూప్యములను దెచ్చి జానకి కిచ్చి వెళ్లిరి. జానకి వానిని సుందరికి దాఁచ నిచ్చెను. మఱునాఁడు నగలవర్తకుఁ డగు విశ్వనాథము నగలపెట్టెను చేతఁ బట్టుకొని నరసింహారావుగారియింటికి వచ్చెను

అప్పుడు పగలు రెండుగంటలు అయినది. నరసింహారావు కచ్చేరికి వెళ్లినాడు. స్త్రీలను మోసగింప నెంచెడు టక్కరివర్తకుల కది మంచిసమయము గదా! విశ్వనాథము సుందరికడకు వచ్చి "అమ్మా క్రొత్తమాదిరి గాజులు, గొలుసులు, ఉంగరములు వచ్చినవి. ఏమైన చూచెదరా" యనెను. సుందరికి మహానగలపిచ్చి! సాధారణముగా విక్రయమునకు వచ్చిన నగను నాపలకుఁ బోనివ్వదు. కాన యలసటతో మంచముపైఁ బవ్వళించియున్న సుందరి చివాలున లేచి "ఏవి చూపుము" అనెను. విశ్వనాథము చాఁపపైఁ గూర్చుండి నగల పెట్టెను దెఱచెను. "అమ్మా! ఇదిగో, చూచినారా? గాజులు! ఇవి యీయూరిలో నింతవఱ కమ్మలేదు సరిగదా! ఇవి యీప్రాంతమున మఱెవరివద్దను దొరకవు. ఇవి మేమే స్వయముగా మా దుకాణములో దయారుచేయించినాము. చెన్నపట్టములోగూడ నీ మాదిరి లేదు. ఇదిగో! ఈగొలుసు చూచినారా? నడుమ కృష్ణునిపతకముగూడ వేసియున్నది. అమ్మాయిగారి మెడలో వేసిన బహుసొగసుగా నుండును. ఇదిగో! గొలుసుపై పలకచెక్కియున్నది. చూచినారా! దీపాల వెలుగున వచ్చముగ వజ్రములవంటివే యనుకొనవలెను. అంతదీప్తిగా నుండును.

ఇదిగో! రాళ్లుపొదిగిన యుంగరములు చూచినారా, ఎంతయందముగా నున్నవో!"

"అన్నియు చూచినాము. డబ్బుండవలెనుగాని నగలకేమి కొదువ! ఆ గొలుసు విలువయెంత?"

"ఒక్కొక్కటి మజూరితో సహా నూటయేబది రూపాయ లగునండీ."

"అబ్బా, ధరచాలయెక్కువగా చెప్పుచున్నావే!"

"ధర యెక్కువనుచున్నారా? మేము దీనికి యిరువది రూపాయలు మాత్రమే కూలి యేర్పఱచినాము. కాని చెన్నపట్టపు నగల దుకాణములలో యీ గొలుసునకే నలువది రూపాయలకు తక్కువ మజూరి తీసికొనరు. మీరు విచారించిచూచినను సరే యుండవలెను. మేమైనను మఱియొకరివద్దనైనచో ముప్పది రూపాయలు చెప్పువారమే. మీరు కావున మఱి పది తగ్గించితిమి."

"విశ్వనాథము! నీ వద్ద నగల మెఱుగుకన్న మాటల మెఱుగెక్కువ. ఎవరివద్ద వారికి తగ్గించినట్లు మాట్లాడెదవే కాని యందఱిపై నీకు సమానానుగ్రహ[illegible] ఎవరికిని తగ్గింపవు. సరే! కూలి మాటకేమిగాని నా [illegible] యిప్పుడంత డబ్బులేదు. పిల్లలొకరికి గొనిన నొకరూరకొనరు. కాన మఱియొకమాటు వానిసంగతి చూచెదను. ఇప్పు డీగాజులవెల చెప్పుము?"

"అఱువది రూపాయలు."

"అఱువది రూపాయలే! ఎత్తుసరి యేమాత్రము?"

"మూడు సవర్సుల యెత్తుసరి. పదిహేను రూపాయలు కూలి."

"అక్కఱ లేదు. తీసికొని పొమ్ము."

"పోనిండు పన్నెం డీయండి."

"లేదు. పది యిష్టమా?"

"మఱియొకటి కట్టుకొనండి బొత్తిగ గిట్టుబా[illegible]ు. లేదు."

"లేదు."

"సరే, యీయండి."

సుందరి వెంటనే గాజులు తీసికొని చేతికిఁదొడుగుకొనినది. తోడనే పిల్లలు "అమ్మా! మా కాకృష్ణుని దండ కొనిపెట్టవుటే" యని పట్టుకొన్నారు. "నా వద్ద డబ్బు లేదు. రాత్రికి మీ నాన్నగారి నడిగి తీసికొనండి. ఊరుకో నెడ" నని తల్లి సమాధానము చెప్పినది. మేనకురాలగు పెద్దపిల్ల మరల మాటాడలేదు. కాని చిన్నది తల్లివలెనే గడ్డరి. కాన "నీ గాజులకైతే డబ్బు ఉన్నది కాబోలు" నని యేడువసాగినది. జానకి యప్పుడు భోజనముల సావడిలోఁ గూర్చుండి భగవద్గీత చదువుకొనుచుండెను. నగలబేర మామెకు చాల సేపటినుండి చెవుల పడుచున్నను బైటకు రాలేదు. కాని సత్యవతి పెద్దయేడ్పు వినగనే చివాలున లేచి యక్కడకు వచ్చెను. సుందరి యేలనో యామెనుజూచి మొగము చిట్లించుకొనెను. జానకి యా యసూయను లెక్కసేయక యేడ్చుచున్న సత్యవతిని జేరదీసి "ఎందుల కేడ్చుచుంటివి" యనెను. "అమ్మా! అమ్మ తాను

గాజులు కొనుక్కొని నాకు గొలుసుకొనమంటే కొన లేదు మామ" అనెను. జానకి ఆపిల్లను యేమనవలదని యూరడించి విశ్వనాథము దెస చూచి "ఆ గొలుసు లేవియో చూపు" మనెను. విశ్వనాథము రెండు గొలుసులు తీసిచూపెను. జానకి పిల్లల కా గొలుసులు చూపి "మీకు" గావలసిన విదియేనా? అనెను. "అవునవియే" యని యాబాల లిరువురు మురిపెమునఁ బలికిరి. జానకి వెంటనే యాగొలుసుల బాలికల మెడలలో వేసి "వీనివెలయెంత" యని విశ్వనాథము నడిగెను.

'రెండుగొలుసులు కూలితో సహా మూడువందల రూపాయ లగు' నని విశ్వనాథము చెప్పెను.

"మంచిది" సుందరమ్మా! నిన్న నీకిచ్చిన మూడు వందలను విశ్వనాథమున కిచ్చివేయుము" అని చెప్పి "మీ గొలుసుల బామ్మగారికి చూపుదురు రండి" యని పిల్లల నిరువురఁ దీసికొని జానకి యటనుండి వెడలి పోయెను.

తనయొడలున నొక్కనగ లేదుకదా! ఆ సొమ్ముతో దానేదియో యాభరణము కొనుక్కొనక తన పిల్లలకుఁ గొలుసులు కొనియిచ్చుటేమి! అని సుందరి కత్యాశ్చర్యము గలిగినది. ఈమె పత్నియా! యోగినియా! లేక యెవరికుండు నీ నిస్పృహ! ఎవరికుండు నీ తన్ను మాలిన ధర్మము! ఎవరికుండు నీరీతి పిత్సనముతో సవతిబిడ్డలకు నగలు కొనిపెట్టెడి యౌదార్యము! ఇట్లు జానకినిగూర్చి మనమున భావింప భావింప సుందరి కత్యంతమును విడియము గలిగెను. తాను నగలు కొనుక్కొనుమనుడ జానకి యటకు వచ్చినందులకే తాను మొగము చిట్లించుకొనెను. జానకి వచ్చినప్పుడెల్లఁ దా నెన్నియో నగలు చేయించుకొనెను; చీరలఁ గొనుక్కొనెను; రవికెలు కుట్టించుకొనెను. వానిలో నత్యల్పమును నొక్క నైకొడ్డ నైనను జానకి కిచ్చుటకుఁ దాను ప్రయత్నింపనయ్యె. ఇంత విరివిగాఁ దాను వెచ్చింపుచున్న యాధన మెవ్వరిది? తనకును జానకికింగూడఁ బెనిమిటియైన నరసింహారావుదే కదా! ఇట్టి తననైచ్య స్వభావముతో జానకి యౌదార్యమును బోల్చుకొని నప్పుడు నిజముగా సుందరికి సిగ్గుగాదా!

౪

రాత్రి యెనిమిదిగంట లగుసరికి నరసింహారావు యింటికి వచ్చెను. తాను కొనుక్కొనిన గొలుసులు చూపుటకై పిల్లలిరువురు నిద్రింపక తండ్రికొఱ కెదురు చూచుచుఁ గూర్చుండిరి. కావున సత్యవతి తండ్రి కెదురుగాబోయి "నాన్నగారు! గొలుసులు కొనుక్కొన్నాము. చూచారా? దీనిలో కట్టుడి బొమ్మకూడా వుంది." అనెను.

"కొన్నారా? మీయమ్మకు పని యేమున్నది! వచ్చిన నగలను బోనీయకుండ గొనుటయే కదా!"

"అమ్మగాదు. అమ్మకొని పెట్టింది—నాకు, అక్కకు. మఱి అన్నకు కూడ ఉంగరం కొంటుందట! అన్న అడిగితే చెప్పింది."

"అమ్మ కొనినదా? ఏవి? అక్కకుగూడనా? చక్కగా నున్నవే!"

ఇంతలో హైమవతివచ్చి తన గొలుసుకూడ తండ్రికిఁ జూపెను. "చక్కగా నున్నవి. కాని మీ యమ్మ నొకమాఱు పిలుచుకొని రండి" అని నరసింహారావు కొమార్తెలతోఁ జెప్పెను. పిల్లలు జానకిని క్షణములోఁ బిలుచుకొనివచ్చిరి. "జానకీ! ఇది యేమిపని? పిల్లల కిదివఱకు నగలు లేవా? లేకున్న తల్లి కొనదా? నీ వేల కొంటివి?" అని నరసింహారావు ప్రశ్నించెను. "పిల్ల కిదివఱకు నగలున్నవని తెలియును. కాని పిల్లలీ గొలుసుపై మిక్కిలి యపేక్షపడిరి. నాకు కొనిపెట్టవలెనని కోరికగల్గెను. కొంటిని."

"పిల్లల యపేక్షకేమి? ఎన్ని యున్నను క్రొత్త వానిని జూచిన కావలయునని యే సంబర పడుదురు. ఒకవేళ కొనినను నీ డబ్బు నేల వెచ్చించితివి? నీ కొక్క నగ లేదుగదా! నీ వేదైన నగను బుచ్చుకొనక పోతివా? పాపము! మీ తండ్రిగారొసగిన ధనముగూడ సవతి బిడ్డలకే వినియోగమా!"

"ఎంతమాటంటిరి? వారు పరాయి బిడ్డలా? వారెవరు? నే నెవరు? పిల్లల కోరిక దీర్చుటే నాకు సంతోషము. నేను కొనిపెట్టుకొనినను పిల్లలనుభవింపు

మున్న యానందమనుభవింపగలనా? నాకు నగలపై నెక్కుడ యాసలేదు."

"నగలపై నాసలేకున్న దాఁచుకొనుట మంచిది. డబ్బు చేఁడా? పాసిపోవునా? జాగ్రత్తచేసికొనిన నెందు కైన వినియోగించునుగదా!"

"నా యుదరపోషణనిమిత్తము నా తండ్రి నా కొపొలమునిచ్చెను. మీ యాశ్రయము లేనప్పుడు నే నా ధనమును నందులకే వినియోగించితిని. కాని యిప్పుడు మీరు నా సంరక్షణబాధ్యత వహించితిరి గదా! నా కింక వేఱె ముల్లె ముడు పేల?"

అట్టి సాధ్వీరత్నముకెడ నిర్దయతో వివేక దూరముగాఁ దాను బ్రవర్తించిన విధమును దలఁపఁగనే నరసింహారావు లజ్జితుఁడై ఖిన్నుఁడై కలవంచెను. అప్రయత్నముగా నతని నేత్రము లశ్రుసిక్తము లయ్యెను.

నాఁటిరాత్రియే సుందరి సుఖముగాఁ బ్రసవించి యొక పుత్త్రికారత్నము గనెను. ఇఁక బిడ్డల సంరక్షణయు, పతిశుశ్రూషయు వాదిగాఁగల గృహకృత్యము లన్నియుఁ బూర్తిగా జానకిశిరముపైఁ బడినవి.

సుందరి పురిటిదినములు సుఖముగా వెళ్లినవి. ఈలోనన నామె తల్లిగూడవచ్చి వారెంతయు పలయు నుపచారములలోఁ బాల్గొనినది. సుందరి పుట్టింటి గ్రామము పల్లెటూరగుటవలన వైద్యావసరములకు ఇబ్బంది యగునని నరసింహారావు ఏ పురిటికిని భార్యను బుట్టింటి కంపువాచారము లేదు. కాని తల్లియు పిల్లయు సుఖముగ నీళ్లుపోసికొనగనె నెలలోపలనే పుట్టింటికి వెళ్లుట యెప్పుడును జరుగుచున్న పద్ధతియే. అట్లే యీ మాఱుగూడ సుందరితల్లి నెలలోపలనె తీసికొని వెళ్లెను. ఆడపిల్ల లిరువురుగూడ తల్లితో వెళ్లిరి. బడిలోఁ జదువుకొనుటవలన కొమారుఁడగు రాముఁడు మాత్రము తండ్రివద్దనే యుండెను.

మూఁడుమాసములకు మరల సుందరి యింటికి వచ్చినది. వచ్చుటతోడనే నిద్రాభిముఖములై యున్న యరమోడ్పు కన్నుఁగవతోడను, పాలిన చెక్కిళ్లతోడను, బడలిన వదనముతోడను, చిక్కిన శరీరముతోడను నొప్పి, వేఁకటి సౌభాగ్యమును వెల్లడింపుచు వేవిళ్లచే నొకిరింపుచున్న జానకినిజూచి సుందరి నివ్వెఱపోయినది.

౫

జానకి పతిగృహప్రవేశము గావించిన పదునైదు మాసముల కొకనాఁటి యుదయమువేళ డాక్టరు గోపాలరావుగారి గుఱ్ఱపుబండి నరసింహారావుగారి మేడముందర నిలిచియుండెను. ఇంటిలోనివారందఱు మిక్కిలి యాతురతతోడను, గలవలపాటుతోడను, నటు నిటు తిరుగుచుండిరి. "అయ్యో! పాపము! ఏమికానున్నదో! ఎందులకువచ్చెనో ఈమాయకడుపు! పాపము! వచ్చి సంవత్సరమున్న ఆయైనదిగదా! ఇంట యేమి ప్రవేశించినదో మరల వీథిగుమ్మ మెఱుఁగదు! ఎంతకాలమునుండియో ఇంట పనుపడియున్న యిల్లాలివలె యెప్పుడు నేదియో యొకపని చేయుచునే యుండెడిది! ఎంత శాంతము! ఎంతయోర్పు! ఎంతవినయము! పనివారలనైన పల్లెత్తుమాటయని యెఱుఁగదుగదా! పేదవారినైన పేరు పిలుపు పిలిచి యెఱుఁగదుగదా! ఎంతమంచితనము! అన్ని సద్గుణములు కలిపి యామెను సృష్టించెను భగవంతుడు! ఇపుడేమి చేయనున్నాడో! పాపము! నెలదినములనుండి జబ్బుగా నున్నదని యుండ అనుచుండ ఏమో! అనుకోంటిమి! ఎంతలో యెంతవచ్చిన" దని వేవిధముల వ్యాకులముతోఁ జెప్పుకొనుచు నిరుగుపొరుగు నమ్మలక్కలు దొడ్డివాఁకిటను వీథివాఁకిటనుగూడ విధివిరామము లేక వచ్చిపోవుచుండిరి. నరసింహారావు యేమియుఁ దోఁచని వాఁడువోలె వీథియరుఁగుపై నటునిటు పచారు చేయుచుండెను. ఇంతలో డాక్టరుగారు లోపలనుండి వాకిలిలోనికి వచ్చెను. "ఏమి యెట్లున్న"దని? నరసింహారావు డాక్టరుగారి నాతురతతో నడిగెను.

"చాల పొరపాటు చేసినారు. ఆమెను పెద్దదు ఆసుపత్రికి పంపవలసినది.

"అవును. మొదటినుండి నాకుగూడ యదే యభిప్రాయము. కాని వెళ్లుటకామె యెంతమాత్ర మంగీకరింప లేదు."

"నిజమే, ఇప్పటికిఁగూడ నామె యదే యభిప్రాయములో నున్నది. కాని రెండుదినములనుండి తీవ్ర

ముగా బ్రసవవేదనఁబడుచుండుటచే నామె మిక్కిలి నీరసించియున్నది. డాక్టరు దొరసానినిగూడ పిలిపించుట మంచిది. ఊరిలో స్త్రీ వైద్యురాం డ్రుండఁగా [illegible]ము చేయిజేసికొనుట యంత ప్రశస్తముకాదని నా యభిప్రాయము.

"అయిన నీగోమను కేశలిక్కు మంత్రసానులతో బని సాగదందురా?"

"సాగదని కాదు. వీరుగూడ మంచిసమర్థురాండ్రే! కాని డాక్టరు దొరసానిగూడ దగ్గఱయుండుట మంచిదని తోచుచున్నది. ఎప్పుడెవరి యవసరమో!"

"అట్లే పిలిపించెదను."

"ఇక నాకు సెలవు."

"చిత్తము" డాక్టరు వెళ్లగనే నరసింహారావు దొరసాని వచ్చుటకై చీటివ్రాసి గుమాస్తాచేతికిచ్చి పంపి వాకిట కుర్చీవైచుకొని గూర్చుండెను. జానకి దుర్భరప్రసవవేదనాజనిత యార్తరవములు మిక్కుటముగాఁ జెవులఁజొచ్చి హృదయమును విదారింపుచుండెను. ఆ యార్తధ్వనులు వినలేక నరసింహారావు కుర్చీపైనుండి లేచి వీథిలోనికి వచ్చెను. ఇంతలో "కావు కావు" మని శిశురోదనధ్వని వినఁబడెను. నరసింహారావు హృద్భారము తీరినట్లు సంతసింపుచు లోనికి వచ్చుచుండెను. ఇంతలో సత్యవతి పరుగెత్తుకొనుచుఁ దండ్రి కెదురువచ్చి "నాన్నగారు! తమ్ముఁడు పుట్టినాఁ"డనెను. నరసింహారావు సంతోషమును వెల్లగక్కు చూపులతో సత్యవతి నెత్తుకొని యరుఁగుమీఁదకు వచ్చి మరల కుర్చీపై శాంతముగాఁ గూర్చుండెను. ఇంతలో "అయ్యో స్పృహతప్పి పడిపోయినది. కన్నులు తిరిగిపోవుచున్నవి. శోషయో యేమో! కొంచెము జావపోయ వచ్చునా? అయ్యో! డాక్టరుగారిని పిలిపించిన బాగుండును." అను కేకలు వినఁబడెను. వెంటనే నరసింహారావు లేచి సావడిలోనికి వచ్చెను. సుందరి కల్లోలపడుచు నరసింహారావు వద్దకువచ్చి "అక్క స్పృహతప్పి పడిపోయినది. వైద్యుని పిలిపించండి" అనెను. ఎవరు లేరే! అంద అన్నిచోటులకుఁ బోయినారని



యాందోళనపడుచు నరసింహారావు వాకిటికి వచ్చుసరికి మోటారుబండి డాక్టరు దొరసాని నెక్కించుకొని వచ్చి వాకిట నిలిచినది. దొరసానితోఁగూడ నరసింహారావు లోనికివచ్చినాఁడు. వెంటనే దొరసాని పురిటిగదిలోనికి వెళ్లి స్మృతిహీనయై పడియున్న జానకి కేదియో వాసన చూపి, సూదిమందెక్కించి, నోటిలో నేమియో స్మృతివచ్చునట్లు చేసెను. సమయమునకు దేవతవలెవచ్చి పోసి రవ్వంతయాపదతప్పించెనని యెల్లరు ముదమందిరి. దొరసానియు వచ్చిన పని సఫలమైనట్లు సంతసింపుచు నరసింహారావువద్ద సెలవుపుచ్చుకొని వెళ్లిపోయెను. పది నిముసములలో జానకి బాగుగా నేత్రములువిప్పి నలువైపులఁజూచి, యొకచోఁ దలుపుపట్టుకొని నిలువఁబడియున్న సుందరి నుపలక్షించి "అమ్మాయీ! భర్తగారి నొకమాటకు దోడ్కొనిరమ్మా." అనెను.

"అక్కా! నీవు చాల నీరసముగా నున్నావు. ఇప్పుడు మాట్లాడజాలవు. కొంచెము తాళి పిలుచుకొని వచ్చెదను. నీవు కొంచెము స్థిమితముగా నుండుము."

"అమ్మాయీ! నీకు తెలియదు. తరువాత కాదు. ఇప్పుడే తీసికొనిరమ్మా; శీఘ్రముగా దీసికొనిరమ్మా."

సుందరి దుఃఖపడుచు వెళ్లి నరసింహారావును బిలుచుకొని వచ్చెను. నరసింహారావు జానకి సమీపమునకువచ్చి తలవంచి "జానకీ! ఎందులకుబిలిచితివి?" అనెను. నరసింహారావు వచ్చునప్పటికే జానకిముఖము వైవర్ణ్యమునందినది. కన్నులు గ్రుంగుచున్నవి. శరీరము చల్లఁబడుచున్నది. అట్టి యవసానస్థితిలో జానకి యతిప్రయ

క్షణముమీఁద చేతులుజోడించి, "స్వామీ! నాకు బలిపరిత్యక్త యను నపయశమును బాపుకొనవలెననియు, పుత్రహీనులగు నా తలిదండ్రులకు దౌహిత్రలాభముచే సద్గతులు గలిగింపవలెననియు రెండు కోర్కెలుండెడివి. భగవదనుగ్రహమువలన నా రెండు కోర్కెలు సిద్ధించినవి. నా కింక సెలవు. ఈ శిశువునకిక తల్లియు దండ్రియు మీరే! ఎట్లు కాపాడెదరో! నాథా! మీకీ విన్నపము చేయుటకే మీ రెన్నివిధముల జెప్పినను నా సుపత్రికిబోక నిలిచితిని. క్షమాపణ" అని వచింపుచుండగనే యంజలిచేసెడి జానకి చేతులు పక్కకొరగి పోయెను. కన్నులు తిరిగిపోయెను. "అయ్యో! అయ్యో! జానకీ! నన్నింత భంగపుచ్చితి"వని యార్తనాదము సేయుచు నరసింహారావు జానకి శరీరముపైఁబడెను. "అయ్యో అక్కా! నన్ను వీడిపోతివా? నీ కెంత పగదాననని భయపడితినో అంతయూ పుత్రరాలవై ప్రియముజూపితివే! అయ్యో! నిన్నెట్లు మఱతును! అమ్మ, అమ్మ యని పలవించు నీబిడ్డల కేమి చెప్పుదును?" అని యగ్గలముగా దుఃఖింపుచు సుందరి నేలగూలెను.

"అమ్మా! జానకమ్మ తల్లీ! పెద్దతనమున నా కెంతకడుపు కోతబెట్టి పోతివి. మిత్తిలు జొచ్చిన ట్లీ యత్తింటికి రాకున్నను బ్రదికియుందువేమో కదే! వచ్చి యేమి యనుభవించితివి! ఏమి కట్టుకొంటివి! ఏమి మట్టుకొంటివి! ఏమియు లేదే! ఏ సౌఖ్యము కారేదే! అప్పుడే యింతయోగమా! అయ్యో! పిల్లలన్న నెంత ప్రేమ! యెంత మురిపెము. ఎందఱు పిల్లలు పుట్టుచుండినను విసుగులేదే! అయ్యో! కడుపునఁగన్న బిడ్డనొక్కమాఱు కన్నులఁజూచుకొనుటకైన నీ కాయువు లేకపోయెఁగా! జానకమ్మా! నీ ముందర నేను చాటినచో నాకు గోమార్తెలు లేని కొఱత యుండదని యనుకొంటిని! అయ్యో, నా ముందరే నీవు వెళ్లిపోతివా! అయ్యో!" అని తలమోదుకొనుచుఁ బుచ్చమ్మగారు నేలఁబడెను.

దేహి వీడిన దేహముపైఁబడి యెందఱు పలవించిన నేమున్నది?

అంత తీక్ష్ణమ్మునందఁ దనదురవస్థ నెఱుఁగని యా యజ్ఞానపు శిశువు కూడ విలపించెను. జానకి యభీష్టము నెఱవేర్చువాఁడై నరసింహారావు తలవని తలంపుగ జరిగిన యా విషాద నాటకమునకు నాశ్చర్యమును దుఃఖ



మును వెలిబుచ్చుచు యేడ్చుచున్న యా శిశువు నక్కునఁ జేర్చెను.